క్లుప్తంగా

పోలీస్ స్టేషన్‌కు చేరిన పది పరీక్ష పత్రాలు



సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నాపత్రాలను భద్రపరుస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: ఏప్రిల్ 3నుంచి జరగనున్న పది పరీక్షల సెట్–1 ప్రశ్నాపత్రాలు ఆదివారం సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. వీటిని అధికారుల సమక్షంలో పెట్టెల్లో ఉంచి సీల్‌వేసి భద్రపరిచారు. కార్యక్రమంలో పేపర్ డిస్ట్రిబ్యూషన్ అధికారి, ఎంఈఓ బి.రాములు, కస్టోడియన్ అధికారి ఎన్.రాజేశ్వరరావు, చీఫ్ సూపరింటెండెంట్‌లు వి.సరోజిని, ఎం.జయరాజు, పి.యాకూబ్, ఎన్.నాగేశ్వరరావు, ఎ.నాగమణి, సలీం, కల్యాణశర్మ, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని నాగులవంచ, సీతంపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఓర్సి శివ, పిడియాల అరుణ లకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధ పడుతున్న శివ, అరుణలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎల్పీ నేత, మధిర శాసనసభ్యుడు మల్లు భట్టివిక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన ఈ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబసభ్యులు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీతంపేట సర్పంచ్ కొండలరావు, ఎంపీటీసీ సభ్యుడు యాకోబు, పార్టీ నాయకులు బసవయ్య, వీరభద్రం, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, చిన వీరబాబు, బసవయ్య, పుల్లయ్య, సుధాకర్, హుస్సేన్, వెంకయ్య పాల్గొన్నారు.

దుస్తుల వితరణ



దుస్తులు అందజేస్తున్న లంకా కొండయ్య

మధిర: పట్టణంలోని ఆజాద్ రోడ్‌లో ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకుకు ఆదివారం కోనా వంశీ ఇంట్లో అదనంగా ఉన్న దుస్తులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ.. దాతల నుంచి సేకరించిన పాత దుస్తులను, అదనంగా ఉన్న దుస్తులను వలస కూలీలకు, నిరుపేదలకు, ప్రమాదంలో గాయపడిన వారికి ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి సహకరిస్తున్న దాతల అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్లు సన్నీ, శ్యామ్, పండు, నరేంద్ర, గోపి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న మొబైల్ యూనియన్ నాయకులు

వైరా: వైరా ఏడో వార్డుకు చెందిన వేల్పుల అనీల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనలో గుండె వద్ద తీవ్రగాయం కాగా.. చికిత్సకు రూ.5 వేలు అవుతాయని వైద్యులు తెలిపారు. అనీల్ నిరుపేద కావడంతో వైరా మొబైల్ యూనియన్ వారు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు.

సమస్యలు పరిష్కరించాలి

ముదిగొండ: అసంఘటితరంగ కార్మికుల సమస్యలకు చట్టపరమైన హక్కులు కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామయ్య అన్నారు. మండలంలోని వనంవారికిష్టాపురంలో ఆదివారం ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మికసంఘం రెండో మండల మహాసభ నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామంలో అసంఘటితరంగ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాస్, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న, నాయకులు శ్రీహరి, పుల్లయ్య, గోవిందరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోక్షమెప్పుడో..?

- అసంపూర్తిగా గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాలు
- అద్దె భవనాల్లో సాగుతున్న పాలన
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



మత్కేపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ నూతన భవనం



మత్కేపల్లిలో పాత పాఠశాల భవనంలో పాలన సాగిస్తున్న పాలకవర్గ సభ్యులు

చింతకాని: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలోని పలు గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మాణాలను చేపట్టిన గ్రామ పంచాయతీ నూతన భవనాలకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో తెలియటం లేదు. గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాలకు నిధుల సరిపడక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్నటువంటి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాలపై 'సాక్షి'ప్రత్యేక కథనం..

మండలంలో పలు గ్రామాల్లో సక్రమంగా లేని గ్రామ పంచాయతీలకు నూతన భవన నిర్మాణాలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఒక్కో పంచాయతీకి రూ.16 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఏడేళ్ల క్రితం నూతన భవన నిర్మాణాలను చేపట్టిన కాంట్రాక్టర్లు నిధులు సరిపడక నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారు. చింతకాని మండలంలోని నేరడ, నాగులవంచ, జగన్నాథపురం, ప్రొద్దుటూరు, కొదుమూరు, పాతర్లపాడు, గ్రామాల్లో నిర్మిస్తున్న భవనాలకు ఫ్లోరింగ్, విద్యుత్, టాయిలెట్లు, డోర్లు, పెయింటింగ్ వంటి పనులు మిగిలిపోగా చింతకాని మండలం మత్కేపల్లి గ్రామంలో స్లాబ్ వరకు మాత్రమే నిర్మించారు. మత్కేపల్లిలో అసంపూర్తిగా ఉన్నటువంటి గ్రామ పంచాయతీ భవనం పశువులకు నిలయంగా మారిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్నటువంటి గ్రామ పంచాయతీ భవన నిర్మాణంపై గ్రామప్రజలు ఇటీవల గ్రామ పర్యటనకు విచ్చేసిన కలెక్టర్‌కు విన్నవించారు. ఇదిలాఉండగా మండలంలో నూతనంగా ఏర్పాటైన తిరుమలాపురం, రాఘవాపురం, గాంధీనగర్‌కాలనీ, నాగులవంచ రేల్వేకాలనీ, రేపల్లెవాడ, నర్సింహాపురం గ్రామ పంచాయతీల్లో గాంధీనగర్‌కాలనీ, తిరుమలాపురం, రేపల్లెవాడ, నర్సింహాపురం గ్రామ పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులను ఇంకా ప్రారంభించలేదు. పలు గ్రామాల్లో సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే పాలన సాగిస్తున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తి భవన నిర్మాణాలను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చే విధంగా ఆలోచన చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేస్తాం..



గ్రామ పంచాయతీ నూతన భవనాల నిర్మాణాలకు ఈజీఎస్ నుంచి మంజూరైన నిధులతో పనులను చేపట్టడం జరిగింది. మిగిలిపోయిన గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలంటే ఒక్కో పంచాయతీ భవనానికి రూ. 3 నుంచి 5 లక్షల నిధులు అవసరమవుతాయి. అసంపూర్తిగా ఉన్నటువంటి నిర్మాణ పనులకు గ్రామ పంచాయతీ నిధులను వెచ్చించి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.

– సీహెచ్.రాంబాబు, మండల ఇన్‌చార్జ్ ఏఈ, చింతకాని

ఇబ్బందిగా ఉంది..



మత్కేపల్లి గ్రామ పంచాయతీకి నూతనంగా నిర్మిస్తున్న భవనం స్లాబు దశకు చేరుకొని అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో మత్కేపల్లిలోని పాత పాఠశాల భవనంలోనే పాలన సాగిస్తున్నాము. కానీ ఇక్కడ పంచాయతీ సమావేశాలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించాలంటే అసౌకర్యంగా ఉంటుంది. కావున అసంపూర్తిగా ఉన్న నూతన భవన నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తిరుపతి కొండలరావు, మత్కేపల్లి గ్రామసర్పంచ్, చింతకాని

పేపర్ లీకేజీపై కాంగ్రెస్ రాస్తారోకో



మధిరలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధిర/కారేపల్లి: టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని, వెంటనే ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం టీఆర్‌ఎస్ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మధిరలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద, కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, తూమాటి నవీన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్‌లు మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి కల్పిస్తామని సీఎం కేసీఆర్ నమ్మబలికి, నిరుద్యోగులను మోసం చేశాడని, ఇప్పుడు తాజాగా ప్రశ్నాపత్రాలు లీకేజీలో వారి జీవితాలను ఆగం చేశారన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు బాలరాజు, రామారావు, బుచ్చిరామయ్య, వెంకటేశ్వరరెడ్డి, ఉద్దండయ్య, జహంగీర్, వెంకటరమణ నాయక్, డేవిడ్, నాయకులు పోలగాని శ్రీనివాసరావు, వాంకుడోతు గోపాల్‌నాయక్, సట్టి వీరభద్రం, చాంద్‌పాషా, సంగు నాగయ్య, కైక తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం



ఆర్డీఓ సూర్యనారాయణ

కల్లూరు రూరల్: కల్లూరు రెవెన్యూ పరిధిలోని కల్లూరు, సత్తుపల్లి, వెంసూరు,పెనుబల్లి, తల్లాడ మండలాల్లో ఖాళీగా ఉన్న 19 చౌకధరల దుకాణాల డీలర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ సూర్యనారాయణ కోరారు. ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డివిజన్లో కొత్తగా ఏర్పడిన 16 చౌక దుకాణాలు వివిధ కారణాలతో గతంలో ఖాళీగా ఉన్న 3దుకాణాలు మొత్తం 19 డీలర్ల నియామకానికి రోస్టర్ పాయింట్ల ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం కేటాయించటం జరిగిందన్నారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండాలి. కనీసం 7వ తరగతి ఉత్తీర్ణులైన వారిని పరిగణలో తీసుకుంటామన్నారు. వయస్సు 18 నుంచి 40 సంవత్సరాలలోపు వారైఉండాలి. రాత పరీక్ష, మౌళిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 16న ఉదయం 11గంటల నుంచి 12–30 వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. దరఖాస్తులు కల్లూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సమర్పించాలని వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


సమ్మేళనాలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న కల్లూరు మండల అధ్యక్షుడు పాలెపు రామారావు


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే.రఫీ కోరారు. పట్టణంలోని 1, 3, 4, 5, 8, 9, 16, 17వ వార్డులలో ఆదివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనంతగా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏప్రిల్ 25న నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు కొత్తూరు ఉమా, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, వార్డు కౌన్సిలర్లు సూరిబాబు, మేకల భవాని, మట్టా ప్రసాద్, నరుకుళ్ల మమత, పుష్పాలత, మరికంటి శ్రీను, ఎస్‌కె ఛాంద్‌పాషా, జమలమ్మ పాల్గొన్నారు.

కల్లూరు రూరల్: మండలంలో ఆదివారం గ్రామ శాఖల జనరల్ బాడీ సమావేశాలను నిర్వహించారు. మండలంలోని చెన్నూరు, చిన్నకోరుకొండి, వెన్నవెల్లి, కృష్ణయ బంజరు, పుల్లయ్య బంజరు, పడమర లోకవరం, యజ్ఞ నారాయణపురం, ముచ్చవరం, పాయపూరు తదితర గ్రామ పంచాయతీ వారిగా బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు, సర్పంచ్‌లు ఎపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కల్లూరు మండల అధ్యక్షుడు పాలెపు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ సభ్యుడు అజయ్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరావు, జెడ్పీటీసీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, డీసీసీబీ డైరెక్టర్ లక్ష్మణరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఎంపీటీసీ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

హెచ్చరిక బోర్డులేవి..?



మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని వాహనాదారులు, ప్రజలు కోరుతున్నారు. ముదిగొండ మండలంలోని అయ్యగారిపల్లి – గంధసిరి ప్రధాన బీటీ రహదారి మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో రాత్రి వేళల్లో ప్రయాణించేవారు ఎదురెదురుగా ఢీకొని ప్రమాదాలకు గురౌతున్నారు. పైగా రహదారి పక్కనే పెద్దబావి ఉంది. కావున బావిని పూడ్చి, హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలను కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : రాజేష్, ఆర్అండ్‌బీ ఏఈ, ముదిగొండ
సెల్ నంబర్ : 9912340678

ప్రతీ రైతును ఆదుకోవాలి

కొణిజర్ల: అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎంపీపీ గోసు మధు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కొణిజర్లలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం మాట సాయం కాకుండా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలన్నారు. గతేడాది తెగుళ్ల బెడదతో నష్టపోయామని ఈ సారి మొక్కజొన్న వేస్తే అకాల వర్షాలతో పంటంతా పాడై నష్టపోయామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతును ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. రైతన్నలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

ఘనంగా పునీత జోజప్ప పండుగ



కల్లూరు లిటిల్ ఫ్లవర్ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్లు

కల్లూరు: పునీత జోజప్ప పండగను ఆదివారం క్రైస్తవ భక్తులు లిటిల్ ఫ్లవర్ చర్చిలో ఘనంగా జరుపుకున్నారు. చర్చి ఫాదర్ రెవరెండ్ విన్సెంట్ ఆధ్వర్యంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న హైదరాబాద్ ముత్తంగి విచారణ గురువులు రెవ.ఫాదర్ అనీల్ మాట్లాడారు. ఘనంగా భార్యాభర్తల ధ్యాన వడకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరు విచారణ సహాయ గురువులు రెవ.ఫాదర్ దేవదానం, లిటిల్ ఫ్లవర్ స్కూల్ మేనేజర్ రెవ.ఫాదర్ లూర్దు, కొత్తగూడెం విచారణ గురువులు రెవ.ఫాదర్ ఆనంద్, లిటిల్ ఫ్లవర్ చర్చి పారీస్ కమిటీ ప్రెసిడెంట్ కోట కిరణ్‌కుమార్, క్రైస్తవులు పాల్గొన్నారు.

టీఎల్‌పేట చర్చిలో వార్షికోత్సవ వేడుకలు

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట ఆర్సీఎం చర్చిలో ఆదివారం పునీత జోజప్ప మందిరం చర్చి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మతగురువులకు గుడ్‌న్యూస్ బాలికలు నృత్యంతో స్వాగతం పలికారు. సెయింట్ జోసఫ్ ప్రెవెన్సియల్ ఫాదర్ బత్తుల జయరాజ్ ప్రార్థనలో పాల్గొని క్రీస్తు సందేశాన్ని అందించారు. మాల ధరించి క్రైస్తవ భక్తులు సాయంత్రం వరకు ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్‌న్యూస్ సుపీరియర్ నిజావర, ప్రిన్సిపాల్ బ్రిటో, మత పెద్దలు, చర్చికమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

తల్లాడ: మండలంలోని కలకొడిమ, బస్వాపురం, రేజర్ల, తెలగవరం గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేసిన అభివృద్ధిపై ఆదివారం ప్రజలకు వివరించారు. మండలంలో ఎమ్మెల్యే కృషితో రూ.57 కోట్లతో రోడ్ల అభివృద్ధి, తదితర పథకాలపై ప్రచారం నిర్వహించారు. వచ్చే నెల మొదటి వారంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సభలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భద్రరాజు, రైతు బంధు మండల కన్వీనర్ వెంకట్‌లాల్, జోన్ చైర్మన్‌లు దాసురావు, చలపతి, నాయకులు కోటిరెడ్డి, మురళి, జీవీఆర్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, తెలగవరం సర్పంచ్ కృష్ణయ్య, రఘు, నాగులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు



సత్తుపల్లిరూరల్: నేలకొరిగిన కాకర పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్: గాలివాన ప్రభావంతో నేలకొరిగిన మొక్కజొన్న, మామిడి, కూరగాయల తోటలను సత్తుపల్లి వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు పరిశీలించారు. కొత్తూరులో ఒగ్గు శ్రీనివాసరెడ్డికి చెందిన ఏడున్నర ఎకరాలలోని మొక్కజొన్నకు ఎకరానికి రూ.90వేలు చొప్పున,ఐదు ఎకరాలలోని మామిడి కాయలు రాలిపోవటంతో రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు అధికారులకు తెలిపారు. ఒగ్గు ఉమామహేశ్వరరెడ్డి మొక్కజొన్న పంటకు రూ.1.50 లక్షలు, పుచ్చకాయల నర్సారెడ్డికి ఐదు ఎకరాల కాకర పంట పందిళ్లు నేలమట్టం కావటంతో రూ.5 లక్షలు, మొక్కజొన్న పంటకు రూ.2.70 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతులు, వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు తెలిపారు.

ముదిగొండ: మండలంలోని అకాల వర్షాలు వల్ల దెబ్బతిన్న పంటలను ఏఓలు ఆదివారం పరిశీలించారు. మండలంలో 8.8మి.మీ వర్షపాతం కురినట్లు మండల వ్యవసాయాధికారిణి రాధ తెలిపారు. వెంకటాపురం, వల్లాపురం గ్రామాల్లో నేలవాలిన మొక్కజొన్న పంటలను ఏఈఓలు పరిశీలించారు.

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో వర్షాలకు నేలరాలిన మొక్కజొన్న పంటను ఆదివారం మండల వ్యవసాయాధికారి కె.విజయభాస్కరరెడ్డి పరిశీలించారు. నష్టపోయిన పంటల సర్వే నివేదికను జిల్లా అధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుడుముల మల్లిఖార్జున్‌రెడ్డి, తదితరులున్నారు.

వేంసూరు: వర్షాలతో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి రాంమోహన్, ఏఈఓలు పరిశీలించారు. మండలంలో ప్రధానంగా 180 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి



కొణిజర్ల: రామనరసయ్యనగర్‌లో పడిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎన్డీ నాయకులు



ఏన్కూరు: మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొణిజర్ల: మండలంలో వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రైతు కూలీ సంఘం నాయకులు షేక్ ఖాసీమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం నాయకులు మండలంలోని పల్లిపాడు, సింగరాయపాలెం, సిద్దిక్‌నగర్, సాలెబంజర, రామనర్సయ్యనగర్, మల్లుపల్లి, కొణిజర్ల గ్రామాలలో అకాల వర్షం ఈదురు గాలులకు పడి పోయిన మొక్కజొన్న చేలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు సెట్రాం, ఉపేందర్, మోహనరావు, ఉపేందర్, కృష్ణ, స్వర్ణ రమేష్, తండు సోమయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, రాంబాబు, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్రకమిటీ సభ్యులు నూతక్కి నర్సింహారావు, జిల్లా కార్యదర్శి చంద్రమౌళేశ్వరరావులు ఆదివారం తెలిపారు. దెబ్బతిన్న పంటలన్నింటిని సర్వే చేసి పరిహారం అందించాలన్నారు.

తల్లాడ: మండలంలోని వర్షాల కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న, మిరప, పత్తి, మామిడి తోటలను టీడీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏన్కూరు: మండలంలో నష్టపోయిన పంటలను సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ ఖమ్మం జిల్లా నాయకులు ఎస్‌కే.లాల్‌మియా, నాయకులు వెంకటేశ్వర్లు, నర్సింహా, శ్రీనివాసరావు, వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు బాణోతు సురేష్‌నాయక్, మేడ ధర్మారావు, చందులాల్‌నాయక్, వినోద్‌కుమార్, హరి తదితరులు పరిశీలించారు.

తాగునీటి కోసం మహిళల రాస్తారోకో



రహదారిపై రాస్తారోకో చేస్తున్న మహిళలు

కల్లూరు: కల్లూరు పంచాయతీ పరిధిలోని ఎస్సెస్సీ ఎస్టీ కాలనీకి చెందిన మహిళలు ఆదివారం హైవే రహదారిపైన రాస్తారోకో చేశారు. కాలనీలో ఐదు రోజులుగా తాగునీరు, వాడక నీరు అందక తాము తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆందోళనకు దిగారు. కాలనీలో ఉన్న రెండు బోరింగులు పని చేయక పోవడంతో తాము ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా స్పందించడం లేదన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రఘు సంఘటనా స్థలానికి వచ్చి మహిళలతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. తర్వాత నీరు రావడంతో మహిళలు శాంతించారు. పెద్ద చెరువు వద్ద మోటారు కాలి పోవడంతో దాని మరమ్మతుల నిమిత్తం ఈ మూడురోజులు నీటి సరఫరా ఆగిందని పంచాయితీ వారు చెబుతున్నారు. రాస్తారోకో చేసిన వారిలో జగన్నాథం నాగమణి, చనెవుల రమణ, మేగా వెంకటరమణ, బారసాల కృష్ణవేణి, కృష్ణమ్మ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



ముష్టికుంట్లలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు రాకేష్

వైరా: వాతావరణ మార్పుల కారణంగానే విషజ్వరాలు వస్తున్నాయని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ భారవి అన్నారు. వైరాలోని బోడేపూడి కళానిలయంలో ప్రతి నెల లాగే ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జట్ల రంగారావు, బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, సుంకర సుధాకర్, బొంతు సమత, తోట నాగేశ్వరరావు, గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, రజిని, అనుమోలు రామారావు తదితరులు పాల్గొన్నారు.


బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ఆదివారం సంకల్ప సీస్టార్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కొంగర రామయ్య–నాగరత్నం, రవికుమార్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ వైద్యశిబిరాన్ని ఎంపీటీసీ పిల్లలమర్రి మహేశ్వరీ ప్రారంభించారు. ఈ శిబిరంలో గుండె, కిడ్నీ, కీళ్లనొప్పులు, షుగర్, బీపీ, క్యాన్సర్లకు సంబంధించి నిపుణులైన వైద్యులు గంగరాజు, వంశీ, సీతారాం, చైతన్య, రాకేష్‌లు, డాక్టర్ అనీల్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 600 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి రూ.2 లక్షలు విలువ చేసే మందులను అందజేశారు. డాక్టర్ రాకేష్ సొంత గ్రామం కావడంతో పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలనే సంకల్పంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకులు వెంకటనారాయణ, పూర్ణచందర్‌రావు, డాక్టర్ హాసన్ నాయకులు నాగేశ్వరరావు, శ్రీను, నాగభూషణం, షేక్ నజీర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం..

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెం సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ప్రముఖ కార్పొరేట్ సంస్థ యశోద హాస్పటల్స్ వారి ఆధ్వర్యంలో కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్లచే ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందిస్తారన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నటు తెలిపారు. సింగరాయపాలెంతో పాటు సిద్దిక్‌నగర్, తీగలబంజర, మంగాపురం గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

స్నేహమంటే ఇదేరా..

– నిరుపేద స్నేహితుడికి ఇల్లు కట్టించిన మిత్రులు



స్నేహితులు కట్టించిన ఇల్లు

సత్తుపల్లిరూరల్: స్నేహానికన్న మిన్న లోకాన ఏది లేదురా.. అని ఓ సినీ కవి చెప్పింది అక్షర సత్యం. కనీసం ఉండటానికి ఇల్లు కూడా లేకుండా ఇబ్బంది పడుతున్న మండలంలో రుద్రాక్షపల్లికి పంచాయతీలోని సత్యంపేట గ్రామానికి చెందిన జల్లిపల్లి రాంబాబుని చూసి కొందరు బాల్య స్నేహితులు చలించిపోయారు. ఏన్కూరు గురుకుల పాఠశాలలో తనతో పాటు చదివిన మిత్రులు అతని పరిస్థితిని గమనించి అందరు తలా కొంత నగదును సమకూర్చి.. ఒక ఇంటిని నిర్మించి ఇచ్చారు. తమ స్నేహం విలువను చాటి చెప్పారు. దీంతో వారిని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. మిత్రులందరూ తమ సొంత కుటుంబంగా భావించి గృహ ప్రవేశం సందర్భంగా రాంబాబు, లక్ష్మీనర్సమ్మ దంపతులకి నూతన వస్త్రాలను బహూకరించారు. నాకు ఒక ఇంటిని అందించిన నా మిత్రులందరికీ నేను రుణపడి ఉంటానని రాంబాబు అన్నారు. ఈ గృహ ప్రవేశ కార్యక్రమంలో స్నేహితులు కె.వి.అప్పారావు, కిన్నెర ఆనందరావు, పీవీ సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్ శంకర్, ఎం.సంపత్‌కుమార్, ఎస్.కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.